దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గోస్పాడు: దీర్ఘకాలిక వ్యాధులు, గుండె జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండెవ్యాధి డాక్టర్ ప్రసన్న, జనరల్ ఫిజీషియన్ ఉరమాదేవి అన్నారు. శుక్రవారం జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా నంద్యాల టోల్‌ప్లాజా వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో అమిలియో ఆసుపత్రి వైద్య బృందం సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు ప్రసన్న, రమాదేవి డ్రైవర్లకు, సిబ్బందికి వ్యాధుల పట్ల అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం 250 మంది ప్రయాణికులు, ట్రక్కు డ్రైవర్లు టోల్‌ప్లాజా సిబ్బంది, ప్రజలకు రక్తపరీక్షలతో పాటు ఈసీజీ, టుడిఎకో వంటి పరీక్షలతో పాటు మందులను ఉచితంగా అందజేశారు. ప్రాజెక్టు హెడ్ మదన్‌మోహన్, మేనేజర్లు అరుణ్ రాజ్, సర్వేశ్వరరెడ్డి, షేక్ ఖాదర్‌వలి, రూట్ ఆఫీసర్ కుతుబుద్దీన్‌బాషా పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో గురురాజ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయులకు సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పెద్దిరెడ్డి షేక్షావలిరెడ్డి పేర్కొన్నారు. సుమారు 200 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు తెలిపారు. లలితా సరస్వతి పర్యవేక్షించి విజేతలను ప్రకటించారు.


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు పలు రకాల వంటలను తయారు చేసి కళాశాలలో ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ ఇంద్రావతి, అధ్యాపకులు వంటలను రుచి చూశారు. ఆమె మాట్లాడుతు 25 మంది విద్యార్థులు తమ వంటలను స్టాల్స్‌లో ప్రదర్శించారన్నారు. హస్సీనా ప్రథమ, అయ్‌షా ద్వితీయ, సునీల్ తృతీయ స్థానాలలో నిలిచారన్నారు. ముఖ్య అతిథిగా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు.


వంటలను రుచి చూస్తున్న ప్రిన్సిపాల్

వేదిక్ గణితంలో విద్యార్థుల ప్రతిభ

చాగలమర్రి: పాణ్యంలోని కేఆర్ఆర్ పాఠశాలలో శుక్రవారం విశ్వం ఏడ్యుటెక్ ఆధ్వర్యంలో నంద్యాల జోనల్ స్థాయి వేదిక్ గణితం ప్రతిభా పోటీల్లో స్థానిక బ్రిల్లియంట్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరచారు. వ్యాల్యూం–3, 5లో మొదటి స్థానంలో 7వ తరగతి విద్యార్థిని బి.యశశ్విని, ఎస్.సోహెల్‌ను ఎంఈఓ కోటయ్యనాయక్ ప్రశంసా పత్రాలు అందజేశారని హెచ్ఎం. గౌసులాజం తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం

బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని మండలాలకు పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

మండలం	అధ్యక్షుడి పేరు
నంద్యాల	మోరరెడ్డి గారి బసవేశ్వరరెడ్డి
గోస్పాడు	పి.రాజశేఖర్‌రెడ్డి
ఆళ్లగడ్డ	కె.నాగేశ్వరరావు
ఆళ్లగడ్డ మున్సిపాలిటీ	నరసింహారెడ్డి
చాగలమర్రి	జి.కుమార్‌రెడ్డి
దొర్నిపాడు	బి.నాగేశ్వరరావు
రుద్రవరం	ప్రసాద్ రెడ్డి
శిరివెళ్ల	ఐ.ప్రతాప్‌రెడ్డి
ఉయ్యాలవాడ	బి.చంద్రమోహన్‌రెడ్డి

మాజీ మంత్రి శిల్పా జన్మదిన వేడుకలు

బొమ్మలసత్రం: మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శిల్పా మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు, పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక శిల్పా నివాసంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ దాల్‌మిల్ అమీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నాయకులు, అభిమానుల మధ్యలో కేక్ కట్‌చేసి తినిపించుకున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ సోమశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ ఆర్గనైజర్‌లు దేవనగర్‌బాషా, హరి, అధికార ప్రతినిధి అనిల్ అమృతరాజ్, మేధవుల ఫోరం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టీవై శివయ్య, కల్చరల్ వింగ్ అధ్యక్షుడు టీవీ రమణ, కౌన్సిలర్లు చంద్రశేఖర్, షాధిక్‌బాషా, కృష్ణమోహన్, విజయభాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, సమ్మద్, కలామ్‌బాషా, ఆరిఫ్‌నాయక్, నాయకులు పడకండ్ల సుబ్రహ్మణ్యం, సలాముల్లా, నెరవాటి సత్యనారాయణ, సుబ్బలక్ష్మయ్య, పున్నా శేషయ్య, కిరణ్, లక్ష్మినారాయణ, జాకీర్ హుస్సేన్, గన్నీ కరీం పాల్గొన్నారు. దాదా బ్రదర్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిరుపేద లకు బియ్యం ప్యాకెట్లు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. స్థానిక విజయబ్లడ్ బ్యాంక్‌లో యువకులు రక్తదానం చేశారు.


శిల్పా నివాసంలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు, అభిమానులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నంద్యాల(అర్బన్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల తీగల సవరణ, మరమ్మతు పనులకు సంబంధించి డి1, డి2 ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈలు నాగరాజు, రామయ్యలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంతగేటు, బాల్కొండ హాల్, గుడిపాటిగడ్డ, ముల్లాన్‌పేట, జగజ్జనీ టెంపుల్, మాల్దారిపేట, మూలమఠం, నడిగడ్డ, హరిజనవాడ, గాంధీచౌక్, ఫరూక్‌నగర్, బాలాజీ కాంప్లెక్స్, శ్రీనివాసనగర్, చాంద్‌బాడా, మున్సిపల్ టౌన్‌హాల్, రోజాకుంట, సంజీవనగర్, రైతుబజార్, రామనాథరెడ్డినగర్, ఆర్టీసీ బస్టాండ్, బైటిపేట, తదితర ప్రాంతాలతో పాటు ఎస్‌బీఐ కాలనీ, ఎన్‌జీఓ కాలనీ, నూనెపల్లె, సాదిక్‌నగర్, సాయిబాబానగర్, దేవనగర్, విశ్వనగర్, విద్యానగర్, టెక్కె, సుద్దులపేట, పద్మావతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాణిజ్య కేంద్రంగా నంద్యాల

● నగరాలను తలదన్నేలా వ్యాపారాలు ● అందుబాటులో ఆధునిక విద్య, వైద్యం ● పట్టణ నలువైపులా రియల్ ఎస్టేట్ వ్యాపారం


నంద్యాల ఏరియల్ వ్యూ..

నంద్యాల: ఒకప్పుడు చిరు వ్యాపారాలకే పరిమితమైన నంద్యాల నేడు కార్పొరేట్ సంస్థలకు దీటుగా వ్యాపార రంగంలో కొత్త పుంతలు తొక్కుతూ నవ్యతను సంతరించుకుంటోంది. ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలు వస్త్రాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, జ్యువెలరీ, ఫర్నీచర్, వైద్యం, లగ్జరీ హోటల్స్, ఫుడ్ కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి మహా నగరాలకు వెళ్లేవారు. అయితే కొంతకాలంగా వ్యాపార రంగం విస్తరించడం ప్రారంభించింది. దీంతో పలు కార్పొరేట్ సంస్థలు కర్నూలుకు క్యూకట్టాయి. వస్త్ర దుకాణాలు, మాల్స్, ఆస్పత్రులు, సర్జికల్స్, ఆటోమొబైల్స్ వంటి దుకాణాలు మార్కెట్‌లోకి తరలివచ్చాయి. కార్పొరేట్ సంస్థలకు దీటుగా స్థానిక వ్యాపార సంస్థలు కూడా తమ వ్యాపారాలను విస్తరించాయి. దీంతో ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. నంద్యాల ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూసిన జిల్లాగా గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడంతో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటు ఇతర జిల్లా కార్యాలయాలు రావడంతో పట్టణానికి మరింత శోభ వచ్చింది. గ్రామాల నుంచి ప్రజలు పనుల కోసం జిల్లా కార్యాలయాలకు వస్తుండటంతో వ్యాపారాలు కళకళలాడుతున్నాయి. ఆటో మొబైల్, పారిశ్రామిక రంగంలో నంద్యాల వాణిజ్య కేంద్రంగా రూపాంతరం చెందుతోంది. ఖరీదైన ద్విచక్ర వాహనాల నుంచి కార్లు, లగ్జరీ, క్యారవాన్ల వరకు నంద్యాలలో తిరుగుతుండటం ఇక్కడి వ్యాపార రంగ అభివృద్ధికి సూచికగా నిలుస్తోంది. జిల్లా రవాణా శాఖ ఇక్కడే ఉండటంతో ద్విచక్ర వాహనాల కంపెనీలతో పాటు ప్రముఖ కార్ల కంపెనీలు, టిప్పర్ల కంపెనీలు నంద్యాలలో బ్రాంచ్‌లను ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నాయి.

అందుబాటులో ఆధునిక వైద్యం..

ఒకప్పుడు ఏ జబ్బు వచ్చినా కర్నూలు, హైదరాబాద్ వంటి నగరాలకు నంద్యాల ప్రజలు పరుగులు పెట్టే వారు. కానీ వైద్యరంగంలోను నంద్యాలలో అధునాతన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు ఏర్పాటు కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా నంద్యాలలోనే అధునాతన వైద్య సేవలు అందుతున్నాయి. కార్పొరేట్ ఆసుపత్రులు జనరల్ ఫిజీషియన్ నుంచి ఆర్థో, డెంటల్, డెర్మటాలజీ, సర్జన్, కార్డియో స్పెషలిస్టుల ద్వారా మంచి వైద్య సేవలు అందుతున్నాయి. పట్టణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రారంభించారు.

ఆధునిక విద్య..


బంగారం దుకాణం

నంద్యాల మొదటి నుంచి విద్యాకేంద్రంగా పేరు గాంచింది. బ్యాంకింగ్ కోచింగ్‌కు నిరుద్యోగులు మన రాష్ట్రం నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది నంద్యాలకు వస్తున్నారు. దీంతో కోచింగ్ సెంటర్ చుట్టుపక్కల వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయి. నంద్యాలలో మూడు ఇంజినీరింగ్ కళాశాలతో పాటు ప్రముఖ కార్పొరేట్ జూనియర్ కళాశాలలతో పాటు ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటవడంతో నంద్యాల ప్రజలు తమ విద్యార్థులను ఇతర ప్రాంతాల్లో చదివించేందుకు ఇబ్బంది లేకుండా పట్టణంలోనే చదివిస్తున్నారు.

పర్యాటకంగా..

పట్టణ సమీపంలో మహానంది, అహోబిలం వంటి ప్రముఖ క్షేత్రాలతో పాటు పట్టణంలో నవనందులు వెలియడం, జగజ్జనినీ మాత ఏర్పాటవడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. దీంతో పెద్ద పెద్ద హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లు తదితరవి ఏర్పాటయ్యాయి.

రియల్‌ఎస్టేట్..

శివారు కాలనీలు, పట్టణం చుట్టూ అనేక వెంచర్లు వెలిశాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల వ్యాపారం పుంజుకుంది. పట్టణ సమీపంలో జాతీయ రహదారి ఉండటం రియల్ ఎస్టేట్ వ్యాపారానికి కలిసి వస్తోంది. నూతన వెంచర్లతో వ్యాపారం కళకళలాడుతోంది.

నాణ్యమైన దుస్తుల విక్రయాలు..

నంద్యాలలో జిల్లా అయినప్పటి నుంచి ప్రముఖ కంపెనీల షాపింగ్ మాల్‌లు నంద్యాలలో ఏర్పాటవుతున్నాయి. షాపింగ్ మాళ్లతో పాటు మార్ట్‌లు, టీవీలతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలకు చెందిన ప్రముఖ దుకాణాలు వెలిశాయి. అలాగే బంగారు ఆభరణాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగా ప్రముఖ నగల దుకాణాలు ఏర్పాటవడంతో ఆధునిక మోడళ్ల నగలు లభిస్తున్నాయి. దీంతో బంగారం వ్యాపారం కూడా జోరుగా సాగుతోంది.


వస్త్ర దుకాణం